1

# అమ్మకూ కావాలి విశ్రాంతి

ప్రియమైన నాన్న గారికి,

మీ కుమార్తె రమ చేయు నమస్కారములు. ఇక్కడ మేమంతా కులాసా. మీ ఆరోగ్యము బాగున్నదని తలుస్తాను. అమ్మ ఈ జనవరి ఆఖరికి రిటైరయి పోతుంది కదా.... ఇన్నాళ్ళూ కాలేజీలో ఉద్యోగం, బాధ్యతలు, ఊపిరి సలపని పనులతో సరిపోతుంది. పై నెల అమ్మను ఇక్కడికి పంపండి. కొన్నాళ్ళు హాయిగా వుండి వస్తుంది. తనకూ కొంత మార్పుగా వుంటుంది. పిల్లలు రవి, ఫణి కులాసా. మీ అల్లుడుగారు మీకు తన నమస్కారములు తెలుపమన్నారు. అమ్మ ఎప్పుడు బయల్దేరేది టెలిగ్రాం ఇవ్వండి. స్టేషనుకు వచ్చి తీసుకు వెళ్తాము. మీ నుండి జవాబు కోసం ఎదురు చూస్తుంటాము. అమ్మకు నమస్సులు.

మీ కుమార్తె

**రమ**

ఉత్తరం చదవడం ముగించి భర్త కేసి సాలోచనగా చూసింది వనజమ్మ.

యాభై ఎనిమిదేళ్ళ వయసులో కూడా చెక్కు చెదరని సౌకుమార్యం వున్నదామెలో. పచ్చని ఛాయలోవున్న నాజూకైన శరీరం ఆమెది. పడుగు పేకల్లా కలిసి వున్న నలుపు తెలుపు వెంట్రుకలు ఆమెకు అదొక రకమైన గాంభీర్యాన్ని, హుందాతనాన్ని ఇస్తున్నాయి.

ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ముగ్గురు పిల్లలను ఎంతో క్రమశిక్షణతో పెంచి, విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులను చేసింది.

వనజమ్మ భర్త రామచంద్రం రెండేళ్ళ క్రిందట రిటైరయ్యాడు. ఆయన పదవిలో వున్నప్పుడూ, లేనప్పుడూ కూడ ఇంటి విషయాలు గానీ, పిల్లల బాధ్యతలు గానీ పట్టించుకోలేదు.

ఇంటా బయటా సర్దుకు రాగల శక్తి సామర్థ్యాలు, సహనము, ఓర్పు వున్న భార్య మీదే అన్ని బాధ్యతలూ వదలి నిశ్చింతగా గడపడం అలవాటైంది ఆయనకు. సంపాదించినది తెచ్చి ఆమె చేతిలో పెట్టడం వరకే తన వంతు అన్నట్టు గడిపేడు.

పిల్లలు కూడా అన్నింటికీ తల్లి మీదే ఆధారపడేవారు. అటు ఉద్యోగ విధి నిర్వహణ,

ఇటు పిల్లల బాధ్యతల నడుమ నలిగిపోయి ఒక్కోసారి ఈ చదువులూ ఉద్యోగాలూ స్త్రీ జీవితాన్ని మరింత కష్టతరం చేసేశాయి అనుకుని విసుక్కునేది ఆవిడ.

పిల్లలందరూ జీవితంలో స్థిరపడ్డారన్న తృప్తితో నిశ్చింతగా పదవీవిరమణ చేయబోతూంది. 'ఇంకో రెండు రోజుల తరువాత కావలసినంత విశ్రాంతి.' అనుకుంటే మనసు తేలికగా వుంది వనజమ్మకు.

'ఇంతకీ ఏం రాయమంటావు నీ కూతురికి? భార్య ఆలోచనలలో పడటం చూసి హెచ్చరిస్తున్నట్టు అడిగాడు రామచంద్రం.

"వస్తానని రాయండి ఇది వరకైతే పిల్లలకు పురుళ్ళన్నా, పుణ్యకార్యాలయినా నాలుగురోజులు సెలవు పెట్టడమే గగనమయ్యేది. ఇప్పుడిక ఖాళీయేగా" అందావిడ నవ్వుతూ.

"అయితే ఒక నెల్లాళ్ళపాటు నాకు స్వయం పాకం తప్పదన్నమాట" దిగులుగా అన్నాడు రామచంద్రం

వనజమ్మ నవ్వి ఊరుకుంది.

"అమ్మయ్యా.... ఇక నీకు కావలసినంత విశ్రాంతి దొరుకుతుంది కదమ్మా...... ఇన్నేళ్ళుగా ఉద్యోగం, సంసారం రెండూ ఎలా లాక్కొచ్చేవో గానీ నాకు మాత్రం, ఇప్పుడే విసుగొచ్చేసింది. ప్రయాణంలో బాగా అలసిపోయి వుంటావు. వేడినీళ్ళు పెట్టేను. స్నానం చేసిరా. భోజనం చేసి తొందరగా నిద్రపోతే అలసట తీరుతుంది." రమ ఆప్యాయంగా తల్లికి ఆహ్వానం పలికింది.

కూతురు కొసరి కొసరి వడ్డిస్తుంటే భోజనం చేస్తున్న వనజమ్మకు ఎన్నడూ పొందని వింత హాయి అనుభవంలోకి వచ్చినట్టుగా వుంది.

"నువ్వెళ్ళి పడుకోమ్మా.. ఇవన్నీ నేను సర్దుకుంటాలే.." కంచం తీయబోతున్న తల్లిని వారిస్తూ అంది రమ.

పడుకున్న పదినిమిషాలలో హాయిగా నిద్ర పోయింది వనజమ్మ.

మామూలుగా ఉదయం ఆరింటికే లేచే అలవాటున్నా, కాలేజికి వెళ్ళనక్కర్లేదన్న ధీమా వలన కాబోలు తెల్లగా తెల్లవారినా మెలుకువ రాలేదామెకు.

"ఏమండోయ్! వాళ్ళిద్దరివీ స్కూలు యూనిఫాంలు రెడీగా వున్నాయా చూడరూ? మళ్ళీ ఎనిమిదింటికి కరెంటు తీసేస్తాడు. ఇస్త్రీ చేయాలంటే కాస్త ఇస్త్రీ పెట్టె వేడి చేయండి బాబూ... ఈ కూర స్టౌ మీద పడేసి వస్తాను..." హడావుడిగా వంటింట్లో నుండి కేక పెట్టింది రమ.

రమ గొంతు విని ఉలికిపడి లేచింది వనజమ్మ.

"పాపం ... పిల్ల హడావుడి పడుతుంటే తను మొద్దు నిద్ర పోయింది" అనుకుంటూ గబగబ ముఖం కడుక్కుని, స్నానం ముగించి వంటింట్లోకి వచ్చింది.

"లేచావా అమ్మా? బాగా నిద్ర పట్టింది కదూ... ఒక్క నిముషం ఈ కూర దింపి నీకు కాఫీ కలుపుతా..." అంది రమ. " అమ్మా ఇస్త్రీ పెట్టె వేడెక్కింది...రా" అంటూ కేక పెట్టేడు ఆరేళ్ళ ఫణి.

"నువ్వెళ్ళి పిల్లల పని చూడు... మిగితా వంట పని నేను ముగిస్తాను." అంటూ

రమ చేతిలోని గరిట అందుకుంది వనజమ్మ.

తొమ్మిదిన్నర అయ్యేసరికి రమ, రమ భర్త, పిల్లలూ అందరూ వెళ్ళిపోయారు.

ఇల్లంతా చిందరవందరగా పడివున్న బట్టలూ, పుస్తకాలూ, ఎక్కడివక్కడ సర్దే సరికి పదిన్నర అయింది.

ఒక గంటసేపు దేవునిపూజచేసుకుని, భోజనం ముగించి పన్నెండున్నరకు మంచంమీద వాలింది వనజమ్మ.

ఉద్యోగం చేసినన్నాళ్ళు ఉరుకులు పరుగులుగా ఇంటిపని ముగించుకుని కాలేజికి వెళ్ళడం, మళ్ళీ సాయంత్రం రాగానే వంటింటి డ్యూటీలో జొరబడటంతో సరిపోయేది.

ఆదివారం వస్తే బట్టలు సర్దడం, బూజు దులపడం, వచ్చే అతిథి దేవుళ్ళకు మర్యాదలూ వీటితో సరిపోయేవి.

రిటైరయ్యాక హాయిగా తీరికగా నిద్రలేచి, నిదానంగా పనులు చేసుకుని మధ్యాన్నం కథల పుస్తకం చదువుకుంటూ గడపాలని కలలు కనేది వనజమ్మ.

ఆలోచనలో వుండగానే పనిమనిషి వచ్చింది.

"అమ్మా గిన్నెలు కడగడానికి పొడి వెయ్యడం మర్చి పోయింది అమ్మ... వేస్తారా?" అనికేక.

"రేపు శుక్రవారం కదమ్మా.. ఇల్లు కడిగేసి పోతా...నువ్వున్నావు గదా... లేకుంటే మళ్ళ రావాల్సి వచ్చేది." అయిదు నిముషాలలో గిన్నెలు కడిగేసి వచ్చి అడిగింది పని మనిషి.

దగ్గరుండి ఇల్లు కడిగించి కాఫీ డికాక్షను వేసి వచ్చి మళ్ళీ నడుము వాల్చింది.

మధ్యాన్నం పూట కాసేపు నిద్రపోతే సాయంత్రమంతా ఉత్సాహంగా వుంటుందనుకుంటూ కళ్ళు మూసుకుందిగానీ నిద్ర రాలేదు.

అంతలో పిల్లలిద్దరూ గోలగోలగా అరుస్తూ వచ్చేసారు.

"అమ్మమ్మా! టిఫినేం చేసావు" రాగానే డిమాండు...

"ఏం కావాలో చెప్పండి... నిముషంలో చేసి పెడతా" అంది చిరునవ్వుతో.

"అలాకాదు అమ్మమ్మా " దోమినిట్ " అనాలి..." మాగీ అడ్వర్‌టైజ్‌మెంటును అనుకరించాడు. ఫణి.

వాళ్ళ చురుకుదనం చూస్తూంటే ముచ్చటగా అనిపించింది వనజకు.

సాయంత్రం ఆరింటికి వచ్చారు. రమా, రమ భర్తా.

"మమ్మీ! రేపట్నించి మాకు యూనిట్ టెస్ట్.... తెలుసా?" రాగానే అమ్మ దగ్గరకు పరిగెత్తాడు రవి.

"ఇకనన్నేం అడక్కండి అమ్మమ్మ వుందిగా... ఆవిడకు చెప్పండి.." అమ్మవైపు చూసి, నవ్వి అంది రమ.

కాఫీ టిఫిన్లు అయ్యాక రమ అలసటగా వంటింట్లోకి వెళ్తుంటే వారించింది వనజమ్మ.

"కాసేపు రెస్ట్ తీసుకో... నేను చేస్తాలే వంట" అని.

రమ కృతజ్ఞతగా చూసి, వెళ్ళి పుస్తకం పట్టుకుని పడుకుంది.

పరీక్షల కోసం పిల్లలను చదివించడం, రమకు ఇన్‌స్పెక్షన్ వున్నదని ఇంట్లో పనంతా తనే చేయడం.. రోజులు ఎలా గడిచాయో తెలియనంత వేగంగా , భర్తకు ఉత్తరం రాసేంత సమయం కూడా దొరకనంత బిజీగా నెల్లాళ్ళు గడిచిపోయాయి.

అమ్మ బయల్దేరుతుంటే రమ బెంగగా అంది "ఇంకా కొన్ని రోజులు వుండకూడ దామ్మా? ఇప్పుడు నీకు కాళీయేగా"

"అక్కడ మీ నాన్నగారు ఎన్నాళ్ళని వండుకోగలరు చెప్పు?" అంది వనజమ్మ.

"ఈసారి నాన్నగారినికూడా తీసుకు వచ్చేయి" అంది.

మే నెలలో స్కూళ్ళకు సెలవులివ్వడంతో వనజమ్మ కొడుకు సుధాకరం భార్యా పిల్లలతో వచ్చాడు.

వచ్చిన నాలుగోరోజునే "అమ్మా" ఇన్నాళ్ళయితే సెలవుల్లో కూడ నీకు ఇన్‌విజిలేషన్ వర్క్ అనీ పేపర్లు దిద్దే పని అనీ వుండేది. ఇప్పుడు నీకు తీరికేగా ఈ పిల్లలతో ఎప్పుడూ ఎక్కడికీ కదలడానికే వీలుపడదు. ఈసారి నీ దగ్గర పిల్లల్ని వదిలేసి వెళ్ళొచ్చని నార్త్ టూర్‌కు డబ్బు కట్టాము" అన్నాడు.

"మంచిపని చేసావు.... ఇద్దరూ హాయిగా నాలుగు రోజులు తిరిగి రండి" అంది వనజమ్మ సుధాకరం ముగ్గురు పిల్లలూ ముచ్చటగా ముద్దు లొలుకుతున్నా వాళ్ళ అభిరుచుల మేరకు వండి పెట్టడం, వాళ్ళ పేచీలు తీర్చడం, ప్రొద్దున్నా సాయంత్రం స్నానం చేయించి బట్టలు మార్చడం చాలా శ్రమగానే అనిపించిందావిడకు.

జూన్‌లో స్కూలు తెరిచే రోజుకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఇంట్లో ఏదో వెల్తిగా అనిపించినా కొంత విశ్రాంతి దొరికింది.

వాళ్ళు వెళ్ళి వారం తిరక్కముందే చిన్నకూతురు చాందిని పిల్లల్ని తీసుకుని వచ్చింది.

"అమ్మా .... పెద్దపాప ఈ ఏడాది ఏడోక్లాసుకు వచ్చింది. మాకేమో వచ్చేనెలలో ట్రాన్స్‌ఫర్ అంటున్నారు. దీన్ని మీఅమ్మగారి దగ్గర వదిలేస్తే మంచిది అన్నారు మీ అల్లుడుగారు. నువ్వు ఖాళీగానే వున్నావుగా అన్న ధైర్యంతో సరేనని వచ్చాను" అంది.

కాదనలేకపోయింది వనజమ్మ. పిల్ల చదువు దెబ్బ తినకూడదన్న వుద్దేశంతో తన దగ్గరే పెట్టుకుంది.

పెద్ద పాప ప్రొద్దున ఎమిమిది గంటలకు స్కూలుకు బయల్దేరితే ట్యూషనుకూడా ముగించుకుని సాయంత్రం నాలుగింటికి వస్తుంది. ఉదయం ఎనిమిది గంటలయ్యేసరికల్లా వంటా టిఫినూ పూర్తి చేయాలని అయిదుగంటలకే లేవడం మొదలు పెట్టింది వనజమ్మ.

సాయంత్రం ఆపిల్లను దగ్గర కూర్చో బెట్టుకుని చదివించడం, హోమ్ వర్క్ చూడ్డం చేయాల్సివచ్చింది.

భార్య అవస్థ చూస్తూనే వున్నా ఏమీ అనలేకపోయాడు రామచంద్రం.

దీపావళికి ఇంటికి వచ్చిన రమ తల్లితో చాటుగా అంది. "అది కాదే అమ్మా... చాందిని విషయం తెల్సుగా... ఇతరుల గురించి ఆలోచించదు. అది అడిగితే మాత్రం

నువ్వెందుకు నెత్తిన వేసుకున్నావీ బాధ్యత?” వనజమ్మ నవ్వి వూరుకుంది.

సెవెన్త్ క్లాసు పబ్లిక్ పరీక్షరాసాక పెదపాపను పంపించేసింది వనజమ్మ.

ఈలోగా సుధాకరం నుండి ఉత్తరం వచ్చింది. భార్యకు జాండీస్‌ట పిల్లలతో చేసుకోలేక పోతుంది అమ్మను సహాయంగా పంపండి’ అని.

కోడలు తల్లిలేని పిల్ల. అవసరానికి ఆదుకోకపోతే ఎలాగ అనుకుంటూ ప్రయాణమయ్యింది వనజమ్మ.

కోడలు ఆరోగ్యం కుదుటపడేసరికి ఒక నెల్లాళ్ళు పట్టింది. కోడలికి పథ్యం పిల్లలను చూసుకోవడంతో బాగా అలసిపోయింది.

వనజమ్మ ఇక ప్రయాణమవుదామనుకుంటుండగానే రామచంద్రం వచ్చాడు. కోడల్ని కొడుకునూ చూసినట్టు వుంటుంది, భార్యను కూడా తీసుకుని వెళ్ళొచ్చును అన్న ఆలోచనతో వచ్చాడాయన.

వాళ్ళు రేపు ప్రయాణ మౌతారనగా ముందురోజు అమ్మానాన్నా తీరికగా కూర్చుని వున్నప్పుడు వాళ్ళ దగ్గరగా వచ్చి కూర్చున్నాడు సుధాకరం.

“అమ్మా! అక్కడ అంత ఇంటికీ మీరిద్దరే ఇద్దరు. వండుకోవడం, తినడం, నిద్రపోవడం విసుగ్గా లేదూ... అందుకే నేనూ మీ కోడలు ఒక మాట అడుగుదాం అనుకుంటున్నాం” అన్నాడు.

“మా దగ్గర సంకోచందేనికీ.. ఏమిటో చెప్పు... అంది వనజమ్మ.

“ఏమీ లేదమ్మా. మా రఘుగాడు చదువులో వెనకబడుతున్నాడు. ఈ ఏడాది తొమ్మిదో క్లాసులో కొచ్చాడు. మీ కోడలేమో ముగ్గురి పిల్లలకు చేసుకోలేక సతమతమవుతున్నది.. ఇక వాడి చదువు గురించి ఏం చూస్తుంది? చందూకూతురికి ఏడోక్లాసులో స్కూలు సెకెండ్ వచ్చిందంటే అదంతా నీ చలవే... అంతబాగా చదివించావు దాన్ని. అలాగే రఘుని ఈ రెండేళ్ళూ మీ దగ్గరే పెట్టుకుని ఆ టెన్త్‌క్లాసు మంచిమార్కులతో గట్టెక్కించితే చాలు. నువ్విప్పుడు ఖాళీగానే వున్నావుగనుక అడుగుతున్నా” అన్నాడు.

వనజమ్మ ఏంచెప్పాలో తెలియనట్టు భర్తవైపు చూసింది.

పడక కుర్చీలో వెనక్కివాలి కూర్చున్న రామచంద్రం “చూడు సుధా.. నువ్వు అడిగిన దాన్లో తప్పులేదు. కానీ మీ అమ్మ ఇన్నాళ్ళూ అటు ఉద్యోగం, ఇటు సంసార బాధ్యతలతో నలిగి పోయింది. ఇంకా ఇప్పుడు కూడా తన పిల్లల బిడ్డల బాధ్యత కూడా మోయాలంటే ఓపిక వుండొద్దూ? ఇది వరకటిలా చిన్న వయసు కాదుగా... అరవై దగ్గర పడుతుంది. అవసరం పడినప్పుడు మీకు చేయడానికి ఆమె ఎప్పుడూ వెనుకాడదు. కానీ అమ్మ రిటైరయింది... ఖాళీగానే వుందిగా అని మీరంతా అనుకుంటున్నారే గానీ అమ్మ టైరయిపోయిందని ప్రభుత్వం రిటైరు కమ్మంది. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు . అమ్మకూ విశ్రాంతి కావాలి అని మరచిపోకండి” అన్నాడు గంభీరంగా.

ఆయన ఉద్దేశమే తన మాట అన్నట్టు భర్త వైపు కృతజ్ఞతగా చూసింది వనజమ్మ.

• *A.I.R. Kurnool-18-8-1992* •